క్లుప్తంగా

అవార్డు అందజేత



రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మణి సాయివర్మ

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ వంగపల్లి మల్లేశం–భాగ్య దంపతుల కుమారుడు మణిసాయివర్మ సీఎంఆర్‌లో బీటెక్ చదువుతుండగా నేషనల్ సర్వీస్ స్కీం స్వచ్ఛంద సంస్థలో చేరి ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. ఈ సేవలకు గాను సోమవారం ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, గ్రామస్తులు ఆయనను అభినందించారు.

రాణిప్రసాద్‌కు సత్కారం



సిరిసిల్లటౌన్: 'చంటి ప్రసన్న కేంద్రం' మేడ్చల్ ఆధ్వర్యంలో 'తెలంగాణ వైభవం' అనే పుస్తకాన్ని వెలువరించారు. దానిలో జిల్లా కవయిత్రి డాక్టర్ కందేపి రాణిప్రసాద్ 'రాష్ట్ర పండుగ –బోనాలు' అనే వ్యాసాన్ని రచించారు. ఈ వ్యాసాన్ని 'తెలంగాణ వైభవం' పుస్తకంలో ప్రచురించి డాక్టర్ కందేపి రాణిప్రసాద్‌ను చీరసారెలతో సత్కరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జరిగిన ఈ వేడుకలో ముఖ్యఅతిథిగా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి పాల్గొని రాణిప్రసాద్‌ను సత్కరించారు.

కూలిన ఇంటిని పరిశీలించిన అధికారులు

సాక్షి స్పందన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో శిథిలావస్థకు చేరిన ఇల్లు కూలి పక్కటింపై పడగా కూలిన ఇంటిని సోమవారం మండల అధికారులు పరిశీలించారు. 'కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శిథిలావస్థకు చేరిన ఇంటిని ఇంటి యజమానులు తొలగించకపోవడంతో పక్కన ఉన్న ఇంటివారికి ఇబ్బంది ఎదురవుతున్నట్లు గుర్తించామని మండల పంచాయతీ అధికారి జోగం రాజు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమాని శ్రీనివాస్ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీచేశామన్నారు. ఈ విషయమై తహసీల్దార్, ఎంపీడీవో, జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి నుంచి ఆదేశాలు రాగానే ఇంటిని కూల్చివేస్తామన్నారు. వీఆర్వో ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి జాఫర్, జీపీవో తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల అర్బన్: పట్టణ పరిధిలోని సర్దాపూర్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మాజీ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారన్నారు. ప్రజలు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేములవాడ: పట్టణంలోని మనోహర్ ఆస్పత్రిలో ఈనెల 8న షుగర్ పేషెంట్లు, ఫ్యాటీ లివర్ బాధితులు, ఊబకాయం, మద్యపానం అలవాటున్నవారికి ఉచితంగా ఫైబ్రోసీస్ స్కాన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కే. మనోహర్ సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దాతలసాయం కోసం ఎదురుచూపు



చికిత్స పొందుతున్న హరిప్రసాద్ మూర్తి

వేములవాడ: పట్టణంలోని మున్సిపల్ ఎదురుగా ఉన్న కాలనీలో ఉంటున్న చందనం హరిప్రసాద్ మూర్తి గతనెల 10న కింద పడిపోయాడు. హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించడంతో వైద్యులు బ్రేన్ ట్యూమర్‌గా నిర్ధారించారు. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు రూ.5లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేసే హరిప్రసాద్‌కు ఆర్థికస్తోమత లేకపోవడంతో పలువురు ఆర్థికసాయం అందించేందుకు ముందుకొచ్చారు. అయితే వైద్యానికి మరింత డబ్బు అవసరం కాగా దాతల సాయం ఎదురుచూస్తున్నాడు. హరిప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆర్థికసాయం అందించేవారు 8019441852 నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రసాద్ కోరుతున్నాడు.

జాతరకు ముస్తాబు

- నేడు శ్రీశాల వేంకటేశ్వర స్వామి జాతర, రథోత్సవం
- లక్ష మందికిపైగా తరలిరానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు





విద్యుత్ కాంతుల్లో వేంకటేశ్వర స్వామి ఆలయం

సిరిసిల్లటౌన్: భక్తుల కొంగు బంగారంగా కొలిచేశ్రీశాల వేంకటేశ్వర స్వామి ఆలయం తిరునాళ్ల (జాతర) శోభను సంతరించుకుంది. 800 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీవారి కోవెల బ్రహ్మోత్సవ కాంతులీనుతుంది.ఈ ఆలయం ఉత్తర తెలంగాణాలోనే మహా విష్ణువు ఆలయాల్లో ప్రాశస్త్యం కలిగిఉంది. తొమ్మిది రోజులుగా సాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకన్నస్వామి జాతర జరగనుంది. లక్షమందికి పైగా జాతరలో పాల్గొననున్నారు.

లక్ష మందికిపైగా ..

ఏటా నిర్వహించే శ్రీవారి రథోత్సవానికి రాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు లక్షమందికి పైగా భక్తులు పాల్గొంటారు. రాష్ట్రంలోని మహావిష్ణువు ఆలయాల్లో అతిపెద్ద రథంగా శ్రీశాల క్షేత్రం ప్రాశస్త్యం సంతరించుకుంది. 25 అడుగుల ఎత్తులో ఉండే రథం ఉండటం ఈ ఉత్సవానికి ప్రత్యేకత. తొమ్మిది రోజులుగా సాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం (జాతర) జరుగనుంది. ఈ మేరకు దేవాదాయ, మున్సిపల్, సెస్, పోలీస్‌శాఖలు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణంలో రథంపై స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు వీలుగా క్యూలైన్లు, పెద్ద వాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో..అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఆలయం చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో నిల్చునే భక్తులకు తాగునీటి సరఫరా ఆలయ ప్రాంతంలో వైద్యారోగ్యశాఖ శిబిరం ఏర్పాటు చేశారు. శ్రీవారికి రథంపై దర్శించే భక్తులకు స్పెషల్, సాధారణం, వీఐపీ దర్శనాలకు క్యూలైన్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. జాతరలో అంటువ్యాధులు ప్రబల కుండా మున్సిపల్ సిబ్బంది శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నారు. రథం తిరిగే మాడ వీధుల్లోని రోడ్లపై ఇసుక పోయించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లలో లోటుపాట్లు రాకుండా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సకల సౌకర్యాలు సమకూర్చారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేశాం



రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాటు చేశారు. సిరిసిల్ల కేంద్రంతో పాటు సమీప గ్రామాల ప్రజలు దాదాపు లక్ష మందికి పైగా జాతరలో స్వామివారిని దర్శించుకుంటారని అంచనా. చలువ పందిళ్లు, మౌలిక వసతులు పూర్తిచేశాం. ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక రథంపై స్వామి వారి దర్శనం ఉంటుంది. భక్తుల మొక్కులు చెల్లింపుకు రథంపై, ఆలయంలో ప్రత్యేకంగా హుండీలు ఏర్పాటు చేశాం.

– మారుతిరావు, ఆలయ ఈవో

కమనీయం.. కల్యాణం





ముస్తాబాద్: మండలకేంద్రంలోని శివకేశవుల బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమం, స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక మండపంలో ఉమామహేశ్వరుల కల్యాణ వేడుకలను అర్చకులు హరీశ్‌శర్మ, పార్థసారథి వైభవంగా నిర్వహించారు. మంగళవారం రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శెరయ్య తెలిపారు. అర్చకులు రఘునాథచారి, కృష్ణకాంత్, మాజీ సర్పంచ్ సుమతి, నర్సింలు, వెంకట రాజిరెడ్డి, అగుళ్ల రాజేశం, బందారి సత్తయ్య, సద్ది మధు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని న్యూఅర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజారత్నం సోమవారం తనిఖీ చేశారు. నోట్ బుక్స్, ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. ప్రతివారం మూడు కోడిగుడ్లు, మూడు రోజుల జావా అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, నగేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేత



విద్యార్థులను సత్కరిస్తున్న శంకరయ్య, తదితరులు

ముస్తాబాద్: ప్రముఖ కవి, విశ్రాంత తెలుగు పండితుడు జనపాల శంకరయ్య తన తండ్రి నర్సయ్య స్మారకార్థం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను సోమవారం అందించారు. మండలంలోని ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన బత్తుల ఆదిత్యవర్ధన్, పాక హరిక, మహ్మద్ బుష్రాలకు రూ.7వేల నగదుతోపాటు మెమొంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దూడం మనోహర్, సీనియర్ సిటిజన్ సిరిసిల్ల అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లికి చెందిన జవ్వాజి భాస్కర్‌కు చెందిన రెండున్నర తులాల బంగారు గొలుసు ఈనెల 1న రోడ్డుపై పడిపోయింది. సుమారు రూ.3లక్షల విలువైన బంగారు గొలుసు పడిపోయిందని దొరికిన వారికి బహుమతి కూడా అందిస్తానని గ్రామంలో తెలిపాడు. గ్రామానికి చెందిన జూకొంటి రమేశ్ –స్వప్న దంపతులు బైక్‌పై, బెదిరె మహిపాల్ –నవ్య, బెదిరె లక్ష్మి మరో బైక్‌పై గోపాల మిత్ర భవనం వద్ద నుంచి వెళ్తుండగా వారికి కనిపించింది. గొలుసును తీసుకొని భాస్కర్‌కు అందజేశారు. పోగొట్టుకున్న బంగారు గొలుసును అప్పగించడంతో గ్రామస్తులు వారిని అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం



సిరిసిల్లటౌన్: పట్టణానికి చెందిన జక్కని దీక్షిత–రవితేజ దంపతులు పద్మనగర్ మండల ప్రాథమిక పాఠశాలకు రూ. 50వేలు సొంత ఖర్చులతో పెయింటింగ్ వేయించారు. గతేడాది ప్రభుత్వం అందించే రాగిజావ విద్యార్థులు తాగడానికి వీలుగా రూ.10వేలు వెచ్చించి జార్‌లను విద్యార్థులకు అందించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా పేద విద్యార్థులకు తమవంతు సాయంగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నామన్నారు. మండల విద్యాధికారి దూస రఘుపతి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చకినాల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిల్లా శ్రీకాంత్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బింగి లక్ష్మి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, సునీత, శ్రీనివాస్, మౌనిక తదితరులు దంపతులను అభినందించారు.

పొన్న వాహనంపై స్వామివారు

ముస్తాబాద్: గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీహరిహర దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం హోమం, బలిహరణం నిర్వహించారు. తీర్థప్రసాద వితరణ అనంతరం రామలక్ష్మణ సేవచేశారు. రాత్రి స్వామి వార్లను పొన్న వాహనంపై ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



చందుర్తి: మండలంలోని సనుగుల ప్రాథమిక పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేష్ తెలిపారు. విద్యార్థులు కొత్త ఆధార్ కార్డుల నమోదు, కార్డులో తప్పుల సవరణ, అప్‌డేట్ చేయించుకోవచ్చన్నారు. సనుగుల పాఠశాల విద్యార్థులే కాకుండా ఇతర పాఠశాల విద్యార్థులు ఆధార్ నమోదును ఇక్కడ చేయించుకోవచ్చని మండల విద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట: జిల్లా గౌడసంఘం నూతన ఉపాధ్యక్షుడిగా నియామకమైన జాగీర్ పర్శరాములు గౌడ్‌ను వెంకటాపూర్ గ్రామ గౌడసంఘం సభ్యులు సోమవారం ఘనంగా సన్మానించారు. గౌడసంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



ఎల్లారెడ్డిపేట: జిల్లా కేంద్రంలో పర్యటించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను సోమవారం మండలంలోని రాచర్లబొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాబేరా బేగం– గౌస్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఆమెను సన్మానించారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి సహకరించాలని మంత్రిని చైర్మన్ కోరారు. మార్కెట్ కమిటీలో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం



కోనరావుపేట: మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా రొక్కం దేవారెడ్డి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా మల్యాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా జొన్నల రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కస్తూరి తిరుపతిరెడ్డి, దుంపటి నాగరాజు, గొర్రె సుధాకర్, యెల్లె శ్రీనివాస్, ముఖ్య సలహాదారునిగా దప్పుల కరుణాకర్, కోశాధికారిగా తాళ్లపల్లి దిలీప్, సంయుక్త కార్యదర్శులుగా దండు దేవేందర్, గండి నరేశ్, కార్యవర్గసభ్యులుగా తడుక శ్రీనివాస్, దప్పుల నరేశ్, ఎర్రవెల్లి నరేశ్, మాందాల సంజీవ్, సాసాల గంగాధర్, తాళ్లపల్లి శ్రీకాంత్, సాసాల సురేశ్, మర్యాల కిషన్‌ను ఎన్నుకున్నారు.

రెడ్డి యూత్ కార్యవర్గం..

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో రెడ్డి యూత్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా గోగూరి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కోల రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోగూరి గోవర్ధన్ రెడ్డి, కోశాధికారిగా మోతే మాధవరెడ్డిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని యూత్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

'భగీరథ' నీరు కలుషితం



తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మిషన్ భగీరథ పైపు లీకవడంతో డ్రైనేజీలోని నీరు కలుస్తుందని స్థానికులు తెలిపారు. భగీరథ పైపు డ్రైనేజీ వద్ద లీకవడంతో నీటి సప్లయ్ ఆగినపుడు పైపులోకి మురుగునీరు వెళ్తుందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆలయంలో చోరీ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నార్ల రాజేశం తెలిపారు. ఆలయంలో రూ.2వేలు, విలువైన వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారన్నారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మొదటి బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన శేఖర్ ద్విచక్రవాహనంపై గ్రామంలోకి వెళ్తుండగా, బండలింగంపల్లికి చెందిన కొత్త రాములు మరో ద్విచక్రవాహనంపై ఎదురుగా రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మ కాలనీ గ్రామ పరిధిలోని కేసీఆర్ నగర్ కాలనీలో పారిశుధ్యం లోపించింది. మురుగుకాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఎవరికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు పట్టించుకొని మురుగు కాలువలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: మీరా అఫ్జల్ మహ్మద్ బేగ్
మండల పంచాయతీ అధికారి : 9490083683

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలి



తంగళ్లపల్లి: మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతీ కార్యకర్త, నాయకులు కృషిచేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో సోమవారం జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. గత ప్రభుత్వం పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం, మండల అధ్యక్షుడు టోని, వైద్య శివ ప్రసాద్, మచ్చ శ్రీనివాస్, భూపతి, పర్శరాములు పాల్గొన్నారు.

ముస్తాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ఆ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. గంభీరావుపేటలో కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇరవై నెలల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటా తెలపాలన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన దోపిడీ, అవినీతిని ప్రజలకు వివరించాలన్నారు. రైతుల రూ.2లక్షల రుణమాఫీ, సన్నబియ్యం, రైతు భరోసా, ఉచిత విద్యుత్, బస్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల పంపిణీ వంటి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పర్శ హన్మాండ్లు, తిరుపతి, రాజు, వెంకటి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బోనస్ డబ్బులు చెల్లించాలి



ముస్తాబాద్: సన్నరకం ధాన్యం సాగుచేసిన రైతులకు వెంటనే బోనస్ డబ్బులు చెల్లించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా మాజీ అధ్యక్షుడు గుంటి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని మద్దికుంట, చీకోడు గ్రామాల్లో సీపీఐ జెండాను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 ఇస్తామన్న బోనస్‌ను ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. జిల్లాలో సన్నరకం ధాన్యానికి సంబంధించి రూ.4కోట్ల 62 లక్షలు రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబు, రాజేందర్, శంకర్, బాలయ్య, మల్లయ్య, కమలాకర్, చందు, బాలరాజు, కనుకయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



ఎల్లారెడ్డిపేట: చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లిలో ఆరుగురికి మంజూరైన రూ.1.50 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఇక్కడ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాయకులు కొండె రాజు, బాలుయాదవ్, హైమద్, మార్పు బాల్‌రెడ్డి, రాజమల్లయ్య, అంజనేయులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో సీఎం సహాయనిధి చెక్కులను పలువురికి కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు. రూ. 1.32లక్షల విలువ చేసే చెక్కులను అందించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల నవీన్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో బెంబేలు



చందుర్తి : మండలంలోని బండపల్లిలో వీధికుక్కలు గుంపులు గుంపులుగా వస్తూ పాదచారులు, ద్విచక్రవాహనదారుల వెంటబడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వీధుల్లో 10 సంఖ్యకు పైగా కుక్కలు సంచరిస్తుండడంతో గ్రామంలో పనుల నిమిత్తం బయటకు వచ్చేందుకు భయపడుతున్నామన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు.

చోరీ కేసులో మూడేళ్ల జైలు

సిరిసిల్లకల్చరల్: చోరీ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. పట్టణ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... 2017 అక్టోబర్ 7న పట్టణానికి చెందిన ఆడెపు లక్ష్మణ్ తన కొడుకు వివాహం సందర్భంగా ఇంటికి తాళం వేసి ఫంక్షన్ హాల్‌కు వెళ్లాడు. అదే ఇంట్లో అద్దెకుంటున్న వారు పెళ్లి భోజనాల తర్వాత ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. సమాచారం అందుకున్న లక్ష్మణ్ ఇంటికి రాగా బంగారంతో పాటు రూ.80వేల నగదు చోరీ జరిగిందని గుర్తించి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ శ్రీనివాసరావు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో ఎనిమిది మంది సాక్షుల వాంగ్మూలాన్ని పరిగణలోకి తీసుకున్నారు. బొడ్డు సాయి, పూదరి రాజుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు చెరో రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరికి గాయాలు

వీర్నపల్లి: విద్యుత్ షాక్‌తో అసిస్టెంట్ హెల్పర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని జవహర్‌లాల్ నాయక్‌తండాలో ఓ రైతు విద్యుత్ సమస్య ఉందని తెలపగా గర్జనపల్లికి చెందిన అసిస్టెంట్ హెల్పర్ భూక్య పర్మేష్ అక్కడికి వెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసి ఫ్యూజు వైరువేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. చికిత్స నిమిత్తం అతడిని 108లో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీర్నపల్లి సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మాజీ ఉపసర్పంచ్ బోయిన రవి, పరామర్శించారు.